42% రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరపాలి

- లేదంటే రాష్ట్రంలో ప్రజా ఉద్యమం తప్పదు
- బీసీ బిల్లు పెండింగ్‌లో ఉండగానే ఎన్నికలేల?
- సామాజిక తెలంగాణ సాధనకు సిద్ధంకావాలి
- ఢిల్లీకి వెళ్లడంలో హాఫ్ సెంచరీ కొట్టిన రేవంత్
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత

తెలంగాణ జాగృతిలో చేరిన నాయకులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, జూన్ 14 (నమస్తే తెలంగాణ): బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుతోనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర చట్టసభలు ఆమోదించిన బీసీ బిల్లులు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండగానే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలన్న ఆలోచన సరికాదని హితవు పలికారు. బీసీలకు 42% రిజర్వేషన్లకు ఇవ్వకుండా ఎన్నికలు నిర్వహిస్తే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. 42% రిజర్వేషన్లు కల్పించాకే ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే రాష్ట్రంలో మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బీజేవైఎం నాయకుడు సాయినాథ్‌తోపాటు వివిధ విద్యార్థి సంఘాలకు చెందిన నాయకులు, విద్యార్థులు శనివారం తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి కవిత తన నివాసంలో కండువా కప్పి జాగృతిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సామాజిక తెలంగాణ సాధనకు విద్యార్థులు నడుం బిగించాలని కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండి కీలక పాత్ర పోషించారని, అదే స్ఫూర్తితో సామాజిక తెలంగాణ సాధన ఉద్యమంలో విద్యార్థులు ముందు వరుసలో ఉండాలని కోరారు. రాహుల్‌గాంధీ దర్శనం లేక సీఎం రేవంత్‌రెడ్డి డీలా పడ్డారని, ఢిల్లీకి వెళ్లడంలో రేవంత్‌రెడ్డి హాఫ్ సెంచరీ చేశారని దుయ్యబట్టారు. కనీసం మంత్రివర్గాన్ని కూర్పు కూడా చేసుకోవడం ముఖ్యమంత్రికి చేతకావడం లేదని, ఇంత అసమర్థ, బలహీన ముఖ్యమంత్రిని గతంలో తానెప్పుడూ చూడలేదని విమర్శించారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని రేవంత్‌రెడ్డి ఢిల్లీలో తాకట్టు పెడుతున్నారని మండిపడ్డారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రూ.8 వేల కోట్ల విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యా భరోసా కార్డులు పంపిణీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని విస్మరించిందని ధ్వజమెత్తారు. విద్యార్థుల సమస్యలు, విద్యారంగ పోరాటాలకు తెలంగాణ జాగృతి విద్యార్థి విభాగం మెరుపులా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

కార్యక్రమంలో తెలంగాణ జాగృతి విద్యార్థి సమాఖ్య నాయకులు వర్షిత్ పెద్దరాజుల, సందీప్ దాసోజు, రాధశ్రీ, వైష్ణవి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో ఉచిత న్యాయ సేవలు

జిల్లా జడ్జి వినోద్‌కుమార్ స్పష్టం

కక్షిదారులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్జిలు వినోద్‌కుమార్, అనిత, పోలీసు అధికారి విశ్వప్రసాద్

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జూన్ 14 (నమస్తే తెలంగాణ): నిరుపేదలకు ఉచిత న్యాయసేవలు అందించేందుకే న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసినట్లు 1వ అదనపు జిల్లా జడ్జి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. హైదరాబాద్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అబ్దుల్ జావేద్ పాషా సమక్షంలో శనివారం ఏర్పాటు చేసిన జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవానికి అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1982 సంవత్సరంలో గుజరాత్‌లో తొలి లోక్ అదాలత్‌ను అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి భగవతీ కృషి ఫలితంగా ఏర్పాటు చేశారని అన్నారు. అప్పటి నుంచి జాతీయ లోక్ అదాలత్‌లను నిర్వహించుకుంటున్నామన్నారు. త్వరితగతిన కేసుల పరిష్కారం దిశగా లోక్ అదాలత్‌ను ప్రారంభించినట్లు.. ఇరువర్గాలకు చెందిన కక్షిదారులు రాజీ చేసుకుని కేసులను తొలగించుకునేందుకు ఇది సువర్ణావకాశమన్నారు. ఆరునెలల్లోపు 75 కేసులను పరిష్కరించిన 16వ అదనపు చీఫ్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రభాకర్‌ను ఆయన అభినందించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రవికిశోర్ మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌తో సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ క్షణికావేశంలో జరిగిన సంఘటనలపై పెట్టిన కేసులను వాపసు తీసుకునేందుకు లోక్ అదాలత్ ఉత్తమ వేదికన్నారు. చెక్‌బౌన్స్ కేసులు కూడా అధిక సంఖ్యలో పరిష్కారం కావడంతో కక్షిదారులు లబ్ధి పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి అనిత, పీపీలు, మెజిస్ట్రేట్లు, డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బైకుల చోరీ ముఠా అరెస్ట్

చేవెళ్ల రూరల్, జూన్ 14 : ద్విచక్ర వాహనాలు దొంగిలించి.. నకిలీ ఆర్‌సీలు, నంబర్ ప్లేట్లతో విక్రయిస్తున్న ముఠాను శంకర్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. శనివారం నా ర్సింగి ఏసీపీ రమణ గౌడ్ శంకర్‌పల్లి పీఎస్‌లో ప్రెస్ మీట్ నిర్వహించి వివరాలు వెల్లడించారు. మెహిదిపట్నానికి చెందిన బొగ్గుల శ్రీనివాస్ (42) వృత్తి రీత్యా డ్రైవర్. కొన్నాళ్ల క్రితం శంకర్‌పల్లిలోని డబుల్ బెడ్ రూం బ్లాక్ లోకి షిఫ్ట్ అయ్యాడు. నాలుగు నెలల నుంచి శంకర్‌పల్లి, నార్సింగి, మెహిందీపట్న, అత్తాపూర్, గుడిమల్కాపూర్, కోటి ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడు. ముందుగా తన బైక్‌పై షాపింగ్ మాల్స్, మార్కెట్ పార్కింగ్, పబ్లిక్ ప్లేసుల్లో పగలు, రాత్రి రెక్కీ చేసి ద్విచక్ర వాహనాలను గుర్తించేవాడు. బైక్‌ను చోరీ చేసి.. సేమ్ కలర్, సేమ్ కంపెనీకి సంబంధించి మరో వాహనం నం బర్ ప్లేట్, ఛాసిస్ నంబర్ ఫొటోలు తీసేవా డు. తర్వాత ఆర్‌టీఐకి సంబంధించిన ఎం వ్యాలెట్ యాప్ ద్వారా ఛాసిస్ నంబర్ ఎంటర్ చేసి ఆర్‌సీని డౌన్‌లోడ్ చేసేవాడు. వీటి ఆధారంగా ఆర్‌సీ కార్డు తయారు చేసి.. ఆ నంబర్ ప్లేట్‌ను దొంగిలించిన వాహనానికి బిగించేవాడు. ఆ తర్వాత ఈ ఫొటోలను కొం డాపూర్‌కు చెందిన బొల్లు నాగరాజు అలియాస్ రాజు (38)కు పంపేవాడు. నాగరాజు ఆ ఫొటోలను తన స్నేహితులు, బంధువులకు పంపించి.. ఆ వాహనాలు బ్యాంక్ సీజ్ చేసినవి, మార్టిగేజ్‌లో ఉన్నాయని చెప్పి తన కమీషన్ కలుపుకొని ఎక్కువ ధరకు అమ్మేవాడు. ఇలా వాహన చోరీలకు సంబంధించి శంకర్‌పల్లి పీఎస్‌లో 4, నార్సింగి పీఎస్‌లో 2, కల్సింపుర పీఎస్‌లో 2, గుడిమల్కాపూర్ పీఎస్‌లో 1, అత్తాపూర్ పీఎస్‌లో 2 కేసులు నమోదయ్యాయి. ఈ కేసును చాలెంజింగ్‌గా తీసుకున్న శంకర్‌పల్లి పోలీసులు శుక్రవారం రాత్రి నిందితులను అరెస్ట్ చేసి... వారి నుంచి 12 మోటార్ సైకిల్స్, రూ.8.వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రి మాండ్‌కు తరలించామని, మరింత లోతు గా విచారణ చేస్తున్నట్లు డీసీపీ వెల్లడించారు.

మొక్కలు నాటి.. స్ఫూర్తినిచాటి

పెద్దఅంబర్‌పేట, జూన్ 14: మున్సిపాలిటీ పరిధి కుంట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో యూత్ ఫర్ సేవా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టేట్ స్ట్రీట్ కంపెనీ సహకారంతో శనివారం 300కుపైగా మొక్కలు నాటారు. పాఠశాల గోడల మీద, తరగతి గదుల్లోని గోడలపై విద్యార్థులను ఆకట్టుకునేలా కళారూపాలు (పెయింటింగ్) వేయించారు. విద్యార్థుల్లో విజ్ఞానం పెంపొందించేలా ప్రపంచ చిత్రపటాలు, సైన్స్, దేశభక్తి చాటిన నాయకులు, శాస్త్రవేత్తలకు సంబంధించిన చిత్రపటాలు వేశారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా కోఆర్డినేటర్ చరణ్‌ప్రసాద్, అరుణ్‌సాగర్, ప్రదీప్, అబ్దుల్లాపూర్‌మెట్ ఎంఈవో జగదీశ్వర్, ప్రిన్సిపాల్ సురేఖ పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్ కూలీకి విముక్తి

మాడ్గుల, జూన్ 14 : వెట్టి చాకిరీ చేస్తున్న ఓ కార్మికుడికి విముక్తి కలిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకుడు రామావత్ సంజీవ్ నాయక్.. ఆవుల షెడ్‌లో పని చేసేందుకు పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కోప్నా మూర్ముని పనిలో పెట్టుకున్నాడు. నాలుగేండ్ల నుంచి పని చేస్తున్నా డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. శనివారం మూర్ము పోలీసులను ఆశ్రయించాడు. ఈ విషయమై సీఐ వేణు గోపాల్ రావు, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డికి సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆర్డీవో బాధితుడిని సొంత రాష్ట్రానికి పంపాలని ఆదేశాలు ఇచ్చారు.

జూబ్లీహిల్స్ తుది ఓటరు జాబితాపై అధికారుల కసరత్తు

అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రస్తుతం 3,90,864 ఓటర్లు..

కొత్త ఓటర్ల కలిపితే నియోజకవర్గంలో మరింత పెరగనున్న ఓటర్లు..

జూబ్లీహిల్స్, జూన్ 14: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ తుది ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు ఎన్నికల అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (ఎలక్షన్) మంగతాయారు రెండు రోజులుగా క్షేత్రస్థాయిలో అధికారులతో కలిసి నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో త్వరలో ఇక్కడ ఉప ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఓటరు తుది జాబితాను త్వరలో ప్రకటించనున్నారు. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు ముందస్తు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో ఈఆర్‌వో జాకియా సుల్తానా ఆధ్వర్యంలో ఏఈఆర్‌ఓ, ఖైరతాబాద్ తహసీల్దార్ నయాముద్దీన్, ఇతర ఏఈఆర్‌ఓలు బూత్ స్థాయి ఎన్నికల అధికారులతో సమీక్షలు.. ప్రతి వారం రాజకీయ పార్టీలతో అఖిల పక్ష సమావేశాలు నిర్వహిస్తూ పారదర్శక ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్‌ఓ), యూసుఫ్ గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియ సుల్తానా ఆధ్వర్యంలో తుది ఓటరు జాబితా సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అంతేకాకుండా ప్రతి ఏడాది జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన వారి నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తూ నాలుగు సార్లు ఓటరు నమోదును చేపడుతున్న ఎన్నికల అధికారులు కొత్త ఓటర్ల పై దృష్టి పెడుతున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన ముమ్మరంగా చేపడుతున్నారు.

జూబ్లీహిల్స్‌లో 3,90,864 మంది ఓటర్లు..

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో 329 పోలింగ్ బూత్‌ల పరిధిలో 3,90,864 మంది ఓటర్లున్నారు. అందులో 2,03,406 పురుషులు, 1,87,434 మంది మహిళలు, 24 మంది ఇతరులు వున్నారు. జూబ్లీహిల్స్ లోని అన్ని పోలింగ్‌బూత్ ల పరిధిలో పక్కా ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకు ఓటరు నమోదు.. సవరణలు చేపట్టనుండడంతో జూబ్లీహిల్స్ ఓటర్లు మరింత పెరగనున్నారు.

యూసుఫ్‌గూడలోని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమైన ఈఆర్‌ఓ, డీసీ జాకియా సుల్తానా

మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

సిటీబ్యూరో, జూన్14, (నమస్తే తెలంగాణ): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా మెడికోస్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్రవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 25కి పైగా మెడికల్ కాలేజీలలో 1,050 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు సంస్థ వ్యవస్థాపకుడుడు లోకేశ్ కుమార్, సహ వ్యవస్థాపకుడుడు నవనీత్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న యూసుఫ్

కార్మికుల వేతనాలు పెంచాలి

హిమాయత్ నగర్,జూన్ 14: ప్రభుత్వ ఆసుపత్రుల్లోని శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల జీతాలు రూ.26 వేలకు పెంచాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ)అధ్యక్షుడు ఎండీ యూసుఫ్, ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం హిమాయత్ నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో యూనియన్ సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రుల్లో పని చేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల టెండర్ల కాలపరిమితి ముగిసినా రాష్ట్ర ప్రభుత్వం నూతన టెండర్లు ఆహ్వానించకుండా కార్మికుల జీతాలు పెంచకుండా తీవ్ర అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కాంట్రాక్ట్ కార్మిక చట్టం ప్రకారం కార్మికులకు పండగ సెలవులు, జాతీయ, ఆర్జిత సెలవులు అమలు చేయాల్సి ఉన్నా ఏ ఒక్క వైద్యశాలలో ఈ చట్టాలను అమలు చేయడం లేదని వారు అన్నారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు లేక అల్లాడిపోతున్నా అధికారులు, కాంట్రాక్టర్లు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షురాలు ఎం.లక్ష్మీబాయి, ఉప ప్రధాన కార్యదర్శి హసీనా బేగం, కార్యద ర్శులు పి.సురేశ్, జయలక్ష్మి, ఎస్.కిష్టమ్మ, వినోద్, షహీన్, కవిత, రేణుక, తులసి తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలకు సెలవులు ముగియగా కోఠి సుల్తాన్ బజార్ బుక్ స్టోర్స్, స్టేషనరీ షాపుల వద్ద కొనుగోళ్ల సందడి

పీవీ మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద రోడ్డు మరమ్మతుల కోసం తవ్విన రోడ్డు

కాంగ్రెస్ మీటింగ్ రచ్చ రచ్చ

(మొదటిపేజీ తరువాయి)

అనుచరుడు మాట్లాడే సమయంలో పాతవారిని పక్కన పెట్టి కొత్తవారికి ప్రాధాన్యత ఇస్తే వదిలిపెట్టేది లేదంటూ.. హెచ్చరింపు ధోరణిలో మాట్లాడడంతో సభావేదికపై ఉన్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తీవ్రంగా స్పందించారు. పార్టీని బెదిరిస్తున్నారా.. అంటూ గట్టిగా మందలించడంతో గొడవ రాజుకున్నది. ఒకవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ అనుచరులు, మరోవైపు విజయారెడ్డి అనుచరులు పరస్పరం నినాదాలు చేసుకుంటూ బాహాబాహీకి దిగారు. గట్టిగా కేకలు వేస్తూ గొడవకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకున్నది. ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు, కార్పొరేటర్ విజయారెడ్డికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పార్టీ ఇన్‌చార్జీలు వారిస్తున్నా..ఇరువర్గాల కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో గందరగోళం నెలకొంది. సుమారు 10 నిమిషాల పాటు గొడవ జరిగిన తర్వాత కార్యకర్తలు శాంతించారు. రానున్న డివిజన్ అధ్యక్షుల ఎంపికలో పాతవారికే ప్రాధాన్యత ఇవ్వాలని, కేవలం పెద్ద నేతల వెంబడి తిరుగుతూ పైరవీలు చేసేవారికి పదవులు ఇస్తే ఊరుకునేది లేదంటూ కార్పొరేటర్ విజయారెడ్డి హెచ్చరించారు. కాగా, ప్రజల్లో పలుకుబడి ఉన్నవారికే పార్టీ పదవులు దక్కుతాయని, మీటింగ్స్‌లో వచ్చి జిందాబాద్‌లు కొట్టేవారికి పదవులు దక్కే పరిస్థితి లేదంటూ పరోక్షంగా విజయారెడ్డి అనుచరులకు ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. మొత్తం మీద పార్టీ నాయకుల మధ్య ఐకమత్యాన్ని పెంచడం కోసం ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ సమావేశంలో జరిగిన రచ్చతో పార్టీలోని గ్రూపు తగాదాలు మరింతగా ముదిరిన విషయాన్ని బయటపెట్టాయని పరిశీలకులు అంటున్నారు.

కోతల మోత.. బిల్లుల వాత

(మొదటిపేజీ తరువాయి)

రాకపోవడంతో ఆందోళన చెందుతున్న పరిస్థితి.

శివారులో అప్రకటిత విద్యుత్ కోతలు..

భాగ్యనగరంలో నిరంతర విద్యుత్ సరఫరా అందనిద్రాక్షగానే మారింది. తాత్కాలిక మరమ్మతులు తప్ప.. సమస్యల శాశ్వత పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడంతో వర్షాకాలం ప్రారంభంలోనే విద్యుత్ కోతలు ఎక్కువయ్యాయి. నగరంతో పోలిస్తే శివార్లలో పరిధి ఎక్కువ కాగా అంతరాయాలు ఎక్కువగానే ఉంటున్నాయి.

అప్రకటిత కోతలు..

బడంగ్‌పేట, రాజేంద్రనగర్ ఉప్పర్‌పల్లి, ఇబ్రహీంబాగ్, మొఘల్‌కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి,కుంట్లూరు, బండ్లగూడ జాగీర్, బాలానగర్, మారుతీనగర్, మీర్‌పేట, నారాయణగూడల్లో అప్రకటిత కరెంట్ కోతలు గంటల కొద్దీ ఉన్నాయంటూ వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత నెలరోజులుగా మెయింటెనెన్స్ పేరుతో కొన్నిచోట్ల ప్రకటించిన సమయం కంటే ఎక్కువ సేపు కరెంట్ పోతున్నది. సర్కిళ్ల వారీగా ప్రకటించిన విధంగా ఇన్నిగంటలు కరెంట్ పోతుందని చెప్పినప్పటికీ అంతకంటే ఎక్కువ సమయమే సరఫరా నిలిచిపోతుండటంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు,. వేసవిలోనే చెట్ల కొమ్మలను తొలగించాల్సి ఉండగా.. వర్షాకాలంలో ఆ ప్రక్రియ చేపట్టడంతో నగరవాసులు మండిపడుతున్నారు. ఒకవేళ మరమ్మతులు అని చెప్పినా వాటికి తగ్గట్లుగా వర్షాకాలం ప్రారంభానికి ముందే ఈ పనులు చేపట్టాలని.. కానీ అలా జరగడం లేదని వారు పేర్కొన్నారు.

స్పందించేవారే లేరు..

ఎస్‌పీడీసీఎల్‌లో సిబ్బంది నిర్లక్ష్యం ప్రతిసారీ కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సీఎండీ ముషారఫ్ క్షేత్రస్థాయిలో పర్యటనలు చేసి సిబ్బందిని అప్రమత్తం చేసినా.. వారు తమ వైఖరిని మార్చుకోవడం లేదు. నాలుగురోజులుగా నగరంలో కరెంట్ పోయిందంటూ.. సుమారుగా 300కు పైగా ఫిర్యాదులు పలు ప్రాంతాల నుంచి వచ్చాయి. ఇవి కేవలం డిస్కంలో నమోదైన ఫిర్యాదులే కాగా.. అసలు తమకు కరెంట్ పోయిందంటూ చెప్పడానికి ఫ్యూజ్ ఆఫ్ కాల్ సెంటర్లకు కానీ, సంబంధిత ఏరియాల లైన్‌మెన్లకు కానీ, ఏఈలకు కానీ ఫోన్ చేస్తే స్పందన లేదని పలువురు వినియోగదారులు సోషల్‌మీడియా వేదికగా మండిపడుతున్నారు.

ఫిర్యాదు చేసినా..

కుంట్లూరులో ఏఈ, లైన్‌మెన్ స్పందించలేదని ఒక వినియోగదారుడు ఫిర్యాదుచేస్తే, ఫలక్‌నుమా సబ్‌స్టేషన్ పరిధిలో యథాస్థితి ఉందని తెలుస్తున్నది. టీజీఎస్‌పీడీసీఎల్ యాప్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందించడం లేదని, అంతేకాకుండా సమస్య పరిష్కరించకుండానే ఫిర్యాదు మూసేస్తున్నారని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చంపాపేటలో ఒకరోజులో ఆరుసార్లు కరెంట్ పోయిందంటూ వినియోగదారులు ఎంతగా మొత్తుకున్నా ఎస్పీడీసీఎల్ సిబ్బంది స్పందించడం లేదు. హెల్ప్‌లైన్లు కూడా డౌన్ ఉంటున్నాయని, లైన్‌మెన్లు స్పందించడం లేదంటూ గగ్గోలు పెడుతున్నారు.

.. హెచ్ఎండీఏ రూల్స్

(మొదటిపేజీ తరువాయి)

తరహాలో ఓపెన్ స్పేస్, అంతర్గత రోడ్లు, సెట్ బ్యాక్, పార్కింగ్ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకునే భవన నిర్మాణ అనుమతులను మంజూరవుతాయి.

ఇబ్బందుల పేరిట మార్పులు...

ప్రస్తుతం అమల్లో ఉన్న భవన నిర్మాణ అనుమతులతోనే గడిచిన పదేండ్లలో యావత్ తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ రంగానికి ధీటుగా రియల్ ఎస్టేట్ రంగం దూసుకుపోయింది. హైదరాబాద్ కేంద్రంగా అమ్ముడుపోయిన ఎకరం రికార్డు స్థాయి ధరలతో... గ్రామాలకు రియల్ బూమ్ చేరింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సింగిల్ విండో విధానంలో టీఎస్ బీపాస్ వంటి సంస్కరణలతో అనుమతుల విధానమే మారిపోయింది. నిర్మాణ రంగాన్ని ఒకే గొడుగు తీసుకువస్తూ కావాల్సిన విధానాలను సమర్థవంతంగా అమలు చేశారు. కానీ అధికారంలోకి రావడంతోనే టీఎస్ బీపాస్ స్థానంలో బిల్డ్ నౌ తీసుకువస్తామని చెప్పింది కాంగ్రెస్ సర్కారు. ఆ ఫలితాలను ఇప్పుడు నిర్మాణ రంగం ఎదుర్కొంటూనే ఉంది. ఇప్పటికీ బిల్డ్ నౌ హెచ్ఎండీఏ పరిధిలో పూర్తి స్థాయిలో అమల్లోకి రాలేదు. కాగా, కన్సల్టెన్సీ చేపట్టే అధ్యయనం ద్వారా ఏకరీతి భవన నిర్మాణ విధివిధానాలతో నిర్మాణ రంగానికి ఒరిగే ప్రయోజనం ఎంత వరకు అనేది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యం

పండగ జరుపుతుండగా..గుడ్‌మార్నింగ్ మణికొండ కార్యక్రమంలో వేల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు కృషి చేస్తున్న తీరు అద్భుతమన్నారు. ఇదే తరహాలో ప్రజల్లో బీఆర్ఎస్ శ్రేణులు సంపూర్ణ విశ్వాసాన్ని కల్పించాలన్నారు. 'తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారుకు కాలం చెల్లింది..పరిపాలన అటకెక్కింది. మళ్లీ రాష్ట్రంలో కేసీఆర్ పాలన వస్తేనే మనందరి జీవితాలు బాగుపడతాయని ప్రజలు నిర్ణయించుకున్నారు. వారందరికీ అండగా గులాబీ జెండా ఉండాల'ని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి కార్తిక్‌రెడ్డి అన్నారు.

కార్యవర్గంలో బాధ్యతలు కేటాయింపు

మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ప్రత్యేక సలహాదారు, ఆఫీషియల్ స్పోక్‌పర్సన్‌గా ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా అందె లక్ష్మణ్‌రావు, ఏర్పుల శ్రీకాంత్, కార్యనిర్వాహక కార్యదర్శిగా రామసుబ్బారెడ్డి, కార్యదర్శిగా ఖలీం, మైనార్టీ విభాగం ప్రతినిధిగా షేక్ ఆరీఫ్, కార్యదర్శిగా ఉప్పర అశోక్ కార్యవర్గంలో బాధ్యతలు కేటాయించారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు రూపారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, శ్రీకాంత్, మల్యాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.